సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం
పుష్పగిరి శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారంఅష్టోత్తర కలశాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. - 8లో



నిబంధనల ప్రకారం రెగ్యులర్ చేయాలి
ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
40.0 /27.4

వాతావరణం
జిల్లాలో సోమవారం 27.4 - 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు మంత్రి సవిత రాక

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం ఒక రోజు పర్యటన నిమిత్తం కడపకు రానున్నారు. ఈ సందర్భంగా ఆమె పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. నగరంలోని ఎర్రముక్కపల్లిలో రూ.3.66 కోట్లతో నిర్మించనున్న సీపీ బ్రౌన్ అదనపు స్మారక గ్రంథాలయం, భాషా పరిజ్ఞానం కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. ఆర్ట్స్ కాలేజీ సమీపంలో రూ.10 కోట్లతో నిర్మించనున్న స్టార్టప్ హబ్ భవన సముదాయ నిర్మాణానికి కూడా మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం హార్టికల్చర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హార్టికల్చర్ కన్‌క్లేవ్-2025 కార్యక్రమంలో పాల్గొననున్నారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలే పరిష్కారంగా నిర్వహిస్తున్న డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని ఈనెల 30వ తేది నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని.. ప్రయాణికులు 99592 25848 నెంబరుకు ఫోన్ చేసిగానీ వాట్సాప్ చేసిగాని తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాడి రైతులకు రాయితీతో దాణా

కడప అగ్రికల్చర్ : జిల్లాలో పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో సమీకృత దాణాను అందిస్తుందని జిల్లా పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారదమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50 కేజీల దాణా బ్యాగు పూర్తి ధర రూ. 1110 కాగా ప్రభుత్వం 50 శాతం రాయితీతో రూ. 555లకే అందిస్తుందని తెలిపారు. దాణా అవసరమైన పాడి రైతులు రైతు సేవా కేంద్రాల్లోగానీ, మండలాలోని పశువైద్యాధికారులను గానీ సంప్రదించాలని సూచించారు. భారత్ పశుధన్ యాప్‌లో రైతు పేరు నమోదు అయి ఉండాలని దీంతో పాటు పశువులకు టీకాలు వేసి ఉండాలని తెలిపారు. కేవలం తెల్లరేషన్ కార్డు కల్గిన పాడి రైతులకు ప్రారంభంగా 2,3 పశువులు కలిగిన వారికి ఒక బ్యాగు మాత్రమే అందిస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా పల్లకి సేవ



పల్లకిలో ఊరేగుతున్న భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉత్సవ మూర్తులను వివిధరకాల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు.ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో డివి రమణారెడ్డి, స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

నూతన నియామకం



చౌడవరం సుబ్బనరసయ్య

రాజంపేట : రిప్లబికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షునిగా చౌడవరం సుబ్బనరసయ్య నియమితులయ్యారు. ఈమేరకు ఆర్‌పీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటస్వామి ఉత్తర్వులను విడుదల చేశారు. కేంద్రమంత్రి (సామాజికన్యాయం, సాధికారిత) రాందాస్ అత్వాలే ఆదేశాల మేరకు రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండలం బొమ్మవరానికి చెందిన సుబ్బనరసయ్యను జిల్లా అధ్యక్షునిగా నియమించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

వీరబల్లి : మండలంలో తాటిగుంటపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ పంచాయతీలోని కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు సర్పంచ్‌పై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి (డీపీఓ) ఖాదర్‌వల్లి విచారణ జరిపారు. ఫిర్యాదుదారులను సచివాలయానికి పిలిపించి వారి సమక్షంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నిధుల దుర్వినియోగానికి సంబంధించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ ఖాదర్‌వల్లి

పల్లె.. తల్లడిల్లె!

- పల్లె గొంతులు ఎండుతున్నాయి..
- పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి
- తాగునీటి రవాణా, అద్దెబోర్ల ఏర్పాటు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు



కడప సెవెన్‌రోడ్స్ : పల్లె గొంతులు తడారుతున్నాయి. గుక్కెడు మంచి నీటికోసం అల్లాడుతున్నాయి. అడుగంటిన భూగర్భ జలాలతో జిల్లాలలోని పలు గ్రామాలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నాయి. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో జిల్లాలోని పలు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. సరిపడా తాగునీరు లేక మనుషులు, పశువులు విలవిల్లాడాల్సిన దుస్థితి తలెత్తింది. అనేక మండలాల్లో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటుతున్నట్లు అధికారుల నుంచి నివేదికలు అందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో మరిన్ని గ్రామాలను తాగునీటి ఎద్దడి చుట్టుముట్టనుంది. ఇప్పటికే చాలాచోట్ల తాగునీటి రవాణా, వ్యవసాయ బోరు బావులను అద్దెకు తీసుకోవడం వంటి ఉపశమన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది. ఇంకా రెండు నెలలపాటు నీటి ఎద్దడిని ఎదుర్కొవాల్సి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. వర్షాలు సంవృద్ధిగా సకాలంలో కురిస్తే తప్ప నీటి ఎద్దడి నుంచి త్వరగా బయటపడే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం ముందుచూపుగా వ్యవహరించి ఉంటే ప్రజలకు ఈ కష్టాలు తప్పేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- జిల్లాలోని 18 మండలాల్లో తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్నట్లు అధికారుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. గ్రామ పంచాయతీ నిధులతో బోరు బావులను అద్దెకు తీసుకోవడం, తాగునీటిని ట్యాంకర్ల ద్వారా ప్రజలకు సరఫరా చేసే చర్యలు చేపట్టారు. కొన్నిచోట్ల కొత్త బోరుబావులను ఏర్పాటు, ఉన్న బోరుబావులను లోతు చేయడం వంటి పనులు చేపట్టారు. దాహమేశాక బావి తవ్విన చందంగా ఉపశమన చర్యలు ఆలస్యంగా చేపట్టారు.
- పోరుమామిళ్ల మండలం వెంకటాపురం పంచాయతీలోని ముద్దంవారిపల్లె, వీఎస్ పల్లె మండలం అలిదెన పంచాయతీలోని ఎ.ఓబాయపల్లె, పెద్దముడియం మండలం దిగువ కల్వటాల పంచాయతీలోని బీసీ కాలనీ, చక్రాయపేట మండలం గడ్డంవారిపల్లె పంచాయతీ బయమ్మగారిపల్లె, మద్దికవాండ్లపల్లె, తాటికాదుపల్లె, గండిలలో వ్యవసాయ బోరు బావులను అద్దెకు తీసుకున్నారు. అదే గ్రామ పంచాయతీలోని బీసీ కాలనీలో రవాణా జరుగుతోంది. ఈ గ్రామాల్లో జనవరి నుంచే నీటి ఎద్దడి ఉండడంతో అధికారులు ఈ చర్యలకు ఉపక్రమించారు. వేంపల్లె మండలం రాజీవ్ కాలనీ, మైలవరం మండలం బెస్తవేముల పంచాయతీలోని జంగాలపల్లె, బెస్తవేముల, పెద్దముడియం మండలం దిగువ కల్వటాల బీసీ కాలనీలో పాపాయపల్లె, చక్రాయపేట మండలం సురభి గ్రామ పంచాయతీలోని లక్ష్మీపురం గ్రామాల్లో తాగునీరు రవాణా చేస్తున్నారు. దువ్వూరు మండలం చిన్న సింగనపల్లె, ఎస్సీ కాలనీ, ఎర్రగుంట్ల మండలం వలసపల్లె, ఒంటిమిట్ట మండలం కె.మాధవరం పంచాయతీలోని ముకుందాశ్రమం గ్రామాల్లో సైతం నీటి ఎద్దడి అధికంగా ఉన్నట్లు అధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.
- గత సంవత్సరం జూన్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేది వరకు జిల్లా సాధారణ వర్షపాతం 636.05 మిల్లీమీటర్లకుగాను 772.6 మిల్లీమీటర్లు నమోదైందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. డీవియేషన్ 21.47గా ఉంది. జిల్లాలో ఈ ఏడాది మార్చికి సగటున భూగర్భ జల మట్టం 10.62 మీటర్ల లోతులో ఉంది. మండలాల వారీగా పరిశీలిస్తే అట్లూరు 13.47 మీటర్లు, బి.కోడూరు 10.51, బద్వేలు 10.04, బి.మఠం 1.32, చక్రాయపేట 8.47, చాపాడు 5.23, చెన్నూరు 6.34, సీకే దిన్నె 4.86, దువ్వూరు 10.22, జమ్మలమడుగు 8.77, కలసపాడు 12.88, కమలాపురం 4.03, ఖాజీపేట 14.78, కొండాపురం 5.67, లింగాల 7.02, ముద్దనూరు 12.82, మైలవరం 3.07, పెద్దముడియం 9.9, పెండ్లిమర్రి 25.02, పోరుమామిళ్ల 11.99, ప్రొద్దుటూరు 4.23, పులివెందుల 33.86, రాజుపాలెం 7.04, ఎస్.మైదుకూరు 7.88, సిద్దవటం 19.09, సింహాద్రిపురం 6.04, కాశినాయన 19.09, తొండూరు 6.09, వల్లూరు 5.94, వీఎస్ పల్లె 9.01, వేంపల్లె 8.93, వేముల 5.71, ఎర్రగుంట్ల 5.34 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయి.

నీటి ఎద్దడి నివారణకు రూ. 5.67 కోట్లతో ప్రతిపాదనలు



వేసవి కావడంతో జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టాం. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా, వ్యవసాయ బోరు బావులు అద్దెకు తీసుకోవడం, బోర్ల డీపెనింగ్, ఫ్లషింగ్, కొత్త బోర్ల ఏర్పాటు లాంటివి చేస్తున్నాం. జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులు, గ్రామ పంచాయతీలకు మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఇందుకు ఖర్చు చేస్తున్నాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు కోసం రూ. 5.67 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఎక్కడా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనకుండా అవసరమైన చర్యలను తీసుకుంటున్నాం. – ఏడుకొండలు, పర్యవేక్షక ఇంజనీరు, ఆర్‌డబ్ల్యూఎస్, కడప

డీసీసీబీ ఛైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి

- బెంగుళూరులో స్థిరపడ్డ సూర్యనారాయణ రెడ్డికి ఛైర్మన్‌గిరీ
- జిల్లాలో టీడీపీ జెండా మోసిన నాయకులకు రిక్తహస్తం
- డీసీఎంఎస్ ఛైర్మన్‌గా జయప్రకాష్



సాక్షి ప్రతినిధి, కడప : కడప డీసీసీబ్యాంకు ఛైర్మన్‌గా అట్లూరు మండలానికి చెందిన ఎం సూర్యనారాయణరెడ్డి నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వేములూరు గ్రామానికి చెందిన ఆయన కాంట్రాక్టర్‌గా బెంగుళూరులో స్థిరపడ్డారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చి పోయే సూర్యనారాయణరెడ్డిని డీసీసీబ్యాంకు ఛైర్మన్‌గిరి వరించింది. కడప పార్లమెంటు పరిధిలో డీసీసీబీ ఛైర్మన్ రెడ్డి సామాజిక వర్గానికి, రాజంపేట పార్లమెంటు పరిధిలో డీసీఎంఎస్ ఛైర్మన్ కాపు సామాజిక వర్గం ద్వారా నియమించాలనే దిశగా సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్‌గా రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన జయప్రకాష్‌ను నియమించారు.

చక్రం తిప్పుతున్న వాసు...
తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చక్రం తిప్పుతున్నారు. సూర్యనారాయణరెడ్డికి డీసీసీబీ ఛైర్మన్ ఎంపిక కావడం వెనుక తెరవెనుక ప్రోత్సాహం అందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే బద్వేల్‌పై కన్నేసి ఉంచిన ఆయన టీడీపీ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డికి చాపకింద నీరులా వ్యతిరేక వర్గాన్ని ప్రోత్సహిస్తున్నట్లు టీడీపీ సీనియర్లు భావిస్తున్నారు. అవకాశం వస్తే ఒక్కమారుగా రితేష్‌రెడ్డి వ్యతిరేకులంతా శ్రీనివాసులరెడ్డి చెంతన చేరిపోయేలా పథక రచన చేస్తున్నట్లు సమాచారం. పార్టీకి చేసిన సేవా, సమర్థత కంటే ఆర్థిక బలం ఉన్న సూర్యనారాయణరెడ్డి లాంటి వారిని చేరదీస్తున్నట్లు పలువురు వివరిస్తున్నారు. దూరదృష్టితో ప్రతి సందర్భంలోనూ వ్యవహారం తనకు అనువుగా మల్చుకుంటున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

నమ్ముకున్న వారికి గుండు సున్నా

తెలుగుదేశం పార్టీనే నమ్ముకొని ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు అధినేత చంద్రబాబు ఎగనామం పెట్టారు. నామినేటెడ్ పోస్టులు భర్తీలో తగిన ప్రాధాన్యత లభిస్తుందనుకున్న వారికి నిరాశే ఎదురైంది. ఎన్నికల సమయంలో మాత్రమే కన్పించే సూర్యనారాయణరెడ్డి లాంటి వారికి డీసీసీబీ ఛైర్మన్‌గిరి లభించింది. వేములూరు గ్రామం మినహా మండల స్థాయిలో కూడా ఇప్పటికీ రాజకీయాలు నెరపని సూర్యనారాయణరెడ్డికి పదవి లభించడం వెనుక ఆర్థిక స్థోమత మాత్రమే గుర్తించినట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. కాగా జీవితాంతం టీడీపీ జెండా మోస్తూ వచ్చిన నేతలను కనీస పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం. డబ్బున్న నేతల్ని ఎంచుకొని నామినేటెడ్ పదవులు అప్పగిస్తున్నారు. పార్టీనే నమ్ముకొని అంటిపెట్టుకొని వస్తున్న సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, హరిప్రసాద్, అమీర్‌బాబు లాంటి నేతలు జిల్లా కేంద్రంలో అర్హులుగా ఉన్నప్పటికీ కనీస పరిగణలోకి తీసుకోలేదని పలువురు వివరిస్తున్నారు. ఎన్ని కష్టాలు నష్టాలు ఎదురైనా జమ్మలమడుగు నుంచి జంబాపురం రమణారెడ్డి, ప్రొద్దుటూరు నుంచి ఈవీ సుధాకరరెడ్డి, పులివెందుల నుంచి పేర్ల పార్థసారధిరెడ్డిలాంటి వారు అర్హులైనప్పటికీ వారిని పరిగణలోకి తీసుకోకపోవడంపై పలువురు టీడీపీ నేతలు పెదవి విరుస్తున్నారు.

11న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు



కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంలో గిరి ప్రదక్షిణ కోసం వెళ్లే వారి కోసం మే 11వ తేదీన ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి ఉదయం 6 గంటలకు గోల్డెన్ టెంపుల్ మీదుగా, రాత్రి 9 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా బస్సులు బయలుదేరుతుందన్నారు. ఇందులో టిక్కెట్ ధర రూ. 1044 గా ఉందన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 9.00 గంటలకు కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందన్నారు. ఇందులో చార్జి రూ. 1282లు.
- మైదుకూరు డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. ఇందులో రూ. 1209 చార్జీగా నిర్ణయించారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు మైదుకూరు, కడప మీదుగా సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. ఇందులో టిక్కెట్ ధర రూ. 1273లు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు రాయచోటి, పీలేరు మీదుగా నడుస్తుందన్నారు. ఇందులో చార్జీ రూ. 1242గా ఉందన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరి వెళుతాయన్నారు. ఒక బస్సు సాయంత్రం 6.00 గంటలకు మరో బస్సు రాత్రి 8.00 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా నడుస్తుందన్నారు. ఇందులో ఛార్జీగా రూ. 1363 చొప్పున నిర్ణయించారని తెలిపారు.

వైవీయూ డిగ్రీ పరీక్షలు షురూ



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ ,బీకాం, బ్యాచిలర్ ఆఫ్ వొకేషనల్ 2,4,6 సెమిస్టర్ల పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు 80 కళాశాల నుంచి 55 కేంద్రాల్లో 25,892 మంది విద్యార్థులు రాస్తున్నారు. కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, స్పిరిట్స్ డిగ్రీ కళాశాల కేంద్రాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాస రావు , వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏ అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు మాట్లాడుతూ పరీక్షలు మే 24వ తేదీ వరకు ఉంటాయన్నారు. ఉపకులపతి ఆదేశాల మేరకు పరీక్షలలో ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను నియమించామని, అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తాయన్నారు.

బాధితులకు చట్టపరిధిలో న్యాయం



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ అశోక్ కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఎ.ఆర్ డీఎస్పీ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

బసినికొండలో టీడీపీ బరితెగింపు

- 15కోట్ల విలువైన ప్రభుత్వస్థలం ఆక్రమణకు సన్నాహాలు
- పట్టపగలే జేసీబీతో చదునుపనులు
- ఎమ్మెల్యే చెప్పాడంటూ అధికారులకు బెదిరింపులు



కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు చదును చేసిన టీడీపీ నాయకులు



జేసీబీతో ప్రభుత్వగయాళు భూమిని చదునుచేయిస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె : కూటమిప్రభుత్వ పాలనలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. మదనపల్లె పట్టణశివారు ప్రాంతాల్లో ప్రధాన రహదారికి సమీపంలో కోట్ల విలువచేసే ప్రభుత్వస్థలాలు ఉండటంతో తమ్ము ళ్ల కన్ను వీటిపై పడింది. ముఖ్యంగా బసినికొండ పంచాయతీలో టీడీపీ నాయకులు బరితెగించి ప్రభుత్వస్థలాలను ఇష్టారాజ్యంగా ఆక్రమించేస్తున్నారు. ఏకంగా సచివాలయానికి కూతవేటు దూరంలో సోమవారం ఉదయం జేసీబీతో బహిరంగ మార్కెట్లో రూ.15కోట్లకు పైగా విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు పూనుకున్నారు. స్థానికులు గమనించి మొదట అధికారులకు సమాచారం అందించారు. వారు అక్కడకు వెళ్లి విచారిస్తే..ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరించారు. దీంతో వారు అక్కడ నుంచి వెనుదిరగడంతో స్థానికులు మీడియాకు తెలిపారు.... ఇది ప్రభుత్వగయాళు స్థలం. దీనికి సంబంధించి మీవద్ద ఏ రికార్డులు ఉన్నాయని రిపోర్టర్లు అడిగితే..తమకేమీ తెలియదని అంతా ఎమ్మెల్యేకే తెలుసు అంటూ బుకాయించారు. దీంతో మీడియా వ్యక్తులు తహసీల్దార్ ధనంజయులు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వాట్సప్‌లో ఫొటోలు పంపి, సమాచారం తెలపడంతో ఆక్రమణదారులు పనులు నిలిపివేసి మెల్లగా జారుకున్నారు.

ఆరేళ్ల క్రితమే సాక్షిలో కథనం...
2019 ఫిబ్రవరిలో బసినికొండకు చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు ఎస్‌ఎం.రఫీ..ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్.682 గయాళుభూమిలో తప్పుడు పత్రాలతో దరఖాస్తు పట్టాలు సృష్టించి భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేశాడు. ఈ విషయాన్ని పసిగట్టిన సాక్షి..ఆక్రమణపై కథనం ప్రచురించడంతో ఎట్టకేలకు పనులు నిలిపివేశారు. తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ ఆటలు సాగవని గుట్టుగా ఉండిపోయారు. ప్రస్తుతం మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో..ఎలాగైనా విలువైన ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించుకునేందుకు తప్పుడు పత్రాలతో తమ్ముళ్లు సిద్ధమైపోయారు. దీనిపై తహసీల్దార్ ధనంజయులు వివరణ ఇస్తూ..సమాచారం తెలిసిన వెంటనే పనులు నిలిపివేయించామన్నారు. ఆక్రమణదారులు చూపిస్తున్న దరఖాస్తు పట్టాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు.

గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు

రాయచోటి జగదాంబసెంటర్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) వారి ఆధ్వర్యంలో స్కిల్ ఇంటర్నేషనల్ ప్లేస్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువకులు తమ బయోడేటాలను skillnternational@apssdc.inకు పంపాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ లింకు https:// naipunyam.ap.gov.in/program & registration అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉద్యోగ మేళా

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లా ఉపాధి కార్యాలయం వారి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన పీలేరులోని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రముఖ కంపెనీలతో ఉద్యోగమేళా జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో పనిచేసేందుకు ఆసక్తి గల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివి 18–35 సంవత్సరాలు కలిగి ఉండాలని తెలిపారు.

అతివేగం తెచ్చిన అనర్థం



మృతి చెందిన సుహేల్‌ఖాన్ (ఇన్‌సెట్) (ఫైల్ ఫొటో)



మృతి చెందిన జహరాబీ (ఇన్‌సెట్) (ఫైల్ ఫొటో)

- ఆటోను ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి : అయిదుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

రైల్వేకోడూరు అర్బన్/నందలూరు: రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట గుండాలేరు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున నందలూరు నుంచి తిరుపతికి వెళుతున్న ఆటోను అతివేగం కారణంగా నియంత్రణ కోల్పోయిన లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో నుజ్జునుజ్జయింది.నందలూరుకు చెందిన పి.జహరాబీ (60), పి.సుహేల్‌ఖాన్ (15)లు అక్కడికక్కడే మృతి చెందారు.ఆటోలో ఉన్న రహీముల్లా, ఫరిహానా, సుహానాఖాన్, షాహీదా, అబ్దుల్లాలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిలో నివాసముంటున్న రహీముల్లా నందలూరులోని అత్తగారి ఇంటికి వచ్చాడు. ఒక రోజు ఉండి వేసవి సెలవులు కావడంతో బంధువులను తిరుపతిలోని తన ఇంటికి ఆటోలో తీసుకుని బయలుదేరాడు. మార్గమధ్యంలో అనంతరాజుపేట వద్ద రాజంపేట వైపు వెళుతున్న టీఎస్88ఎల్807 నంబర్ గల లారీ ఢీ కొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. లారీ డ్రైవర్ రఘురామన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌బాబు తెలిపారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పులివెందుల రూరల్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇతను గత కొన్ని రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసి ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఎస్ఐ



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామంలో బాల్య వివాహం చేస్తున్నారని అందిన సమాచారం మేరకు సోమవారం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 ఏళ్ల బాలికకు 26 ఏళ్ల యువకుడితో మరో రెండు రోజుల్లో వివాహం చేయాలని నిర్ణయించారు. ఎస్ఐ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువురిని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇరువురి పెద్దలపై బైండోవర్ కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన రఘు

వీరపునాయునిపల్లె : అప్పుల బాధ తాళలేక వెల్దుర్తి గ్రామానికి చెందిన మాతిగాళ్ల రఘు(42) అనే రైతు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా.. రైతు సోమవారం ఉదయం పొలం దగ్గరికి వెళ్లి అక్కడే ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకున్నాడు. చుట్టు పక్కల ఉన్న పొలాల రైతులు గుర్తించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి 1.5 ఎకరం పొలం ఉందని పొలంలో పంటలు సరిగ్గా రాకపోవడం ఒక కారణం కాగా, ముగ్గురు కుమార్తెల పెళ్లిల్లు ఎలా చేయాలన్నదే ఆత్మహత్యకు ప్రధాన కారణమని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడుతున్న వ్యక్తి అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : ఆన్‌లైన్‌లో క్యాసినో అనే బెట్టింగ్ గేమ్‌ను ఆడుతున్న వ్యక్తిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తాళ్లమాపురం గ్రామానికి చెందిన మాచిరెడ్డి చైతన్య రెడ్డి ఆన్‌లైన్‌లో క్యాసినో అనే బెట్టింగ్ గేమ్ ఆడుతుండగా సోమవారం రూరల్ ఎస్ఐ వెంకట సురేష్ అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.20,800 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాంకేతిక విద్య.. భవితకు భరోసా!

- పదవ తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం
- పాలిటెక్నిక్ విద్యతో మంచి ఉద్యోగావకాశాలు
- రేపు పాలిసెట్ ప్రవేశ పరీక్ష
- జిల్లాలో 8 వేల మంది దాకా పరీక్ష రాయనున్న విద్యార్థులు
- జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు

జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు	07
జిల్లాలో ఉన్న ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు	08
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్లు	2000
ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో ఉన్న సీట్లు	3600
ప్రైవేటు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మొత్తం సీట్లు	5600

కడప ఎడ్యుకేషన్ : పదవ తరగతి తరువాత వీలైనంత తొందరగా ఉద్యోగం సంపాదించాలనుకునే వారికి పాలిటెక్నిక్ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. సాధారణంగా పదవ తరగతి తరువాత ఇంటర్, డిగ్రీ కోర్సులు చేయడం సాధారణం. అయితే డిగ్రీ పూర్తయి ఉద్యోగం వచ్చేంత సమయం లేకపోవడంతో చాలామంది పాలిటెక్నిక్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. పదవ తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలలో ఉత్తమ ర్యాంకు సాధించిన వారికి రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ప్రవేశాలు లభిస్తాయి. ఇటీవలే పదవ తరగతి పరీక్షలు కూడా ముగిశాయి. ఫలితాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా పాలిసెట్ కోసం దాదాపు 8 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు.

మెండుగా ఉద్యోగ అవకాశాలు..

పదవ తగరతి చదివిన వెంటనే సాంకేతిక విద్య చదవాలనే గ్రామీణ పేద విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సు గొప్ప అవకాశం. ఇంజనీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక విద్య అభ్యసించడం ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది. పాలిటెక్నిక్‌లో ఏ కోర్సు చేసినా ఉద్యోగం, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. దీంతో భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం ఉంటుంది. ఇటీవల వివిధ సంస్థలు నేరుగా కళాశాలలకు వెళ్లి పాలిటెక్నిక్ చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులను తమ సంస్థలో ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నారు.

ఈ నెల 30న ప్రవేశ పరీక్ష..

ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ పరీక్ష రాయాల్సిందే. పాలిసెట్ దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 17వ తేదీతో గడువు ముగిసింది. ఈ నెల 30వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్షను కూడా నిర్వహించనున్నారు. ఈ పరీక్ష 120 మార్కులకు ఉంటుంది. ఇందులో గణితం 50 మార్కులకు, ఫిజిక్స్ 40 మార్కులకు, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదవ తరగతి సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష కోసం కడప, ప్రొద్దుటూరులలో 16 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 8 వేల మంది దాకా ఈ పాలిసెట్ ప్రవేశ పరీక్షను రాయనున్నారు.

కోర్సుల వివరాలు ఇలా..

ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో సివిల్, మెకానికల్, ట్రిబుల్ ఈఈ, కంప్యూటర్ మెకానిక్, ఈసీఈ, ఎంఈసీలతోపాటు ఒకటి రెండు కొత్త కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. జిల్లా మొత్తం పైన ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 15 పాలిటెక్నిక్ కళాశాలలకుగాను 5600 సీట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల కోసం ఉచిత కోచింగ్ నిర్వహించారు. ఈ ఉచిత కోచింగ్ 28వ తేదీతో ముగిసింది.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 30వ తేదీన పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. సోమవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో అడిషనల్ కో ఆర్డినేటర్ దామోదరంతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం కడపలో 12 పరీక్షా కేంద్రాలను, ప్రొద్దుటూరులో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ 16 పరీక్షా కేంద్రాలలో దాదాపు 12500 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాస్తున్నారని తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులంతా ఉదయం 10 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరికైనా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ కాకపోతే 29వ తేదీ మధ్యాహ్నంలోగా కడపలోని ప్రభుత్వ మహిళా కళాశాలను సంప్రదించాలని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పరీక్ష రాసేందుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు.

ర్యాంకు సాధిస్తాం..



ఈ నెల 30వ తేదీ నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షలో తప్పకుండా ర్యాంకు సాధిస్తాం. మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో తీసుకున్న కోచింగ్ నాకు బాగా ఉపయుక్తంగా ఉంది. బాగా చదువుకున్నాను.
- వినూతన, కడప

మంచి శిక్షణ పొందాం..



కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా ఇచ్చిన శిక్షణ చాలా బాగుంది. ఇక్కడ ఇచ్చిన శిక్షణతో బాగా ప్రిపేర్ అయ్యాను. ర్యాంకు సాధిస్తాననే నమ్మకం ఉంది.
- నిఖిల్, కడప

ఉచిత మెటీరియల్ ఎంతో ఉపయుక్తం..



ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం ఇచ్చిన మెటీరియల్ బాగా ఉంది. దీంతో పాటు ఉచిత కోచింగ్ కూడా ఉపయోగపడుతుంది. తప్పకుండా ర్యాంకు సాధిస్తాం.
- వర్షిత, కడప

చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు..



పదో తరగతి తర్వాత తక్కువ ఫీజులతో సాంకేతిక విద్య లభించే కోర్సు పాలిటెక్నిక్. ఈ కోర్సు చేయడం ద్వారా విద్యార్థుల భావి జీవితానికి బంగారు బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది.జాబ్ మేళా, క్యాంపస్ ఇంటర్వ్యూలలో పెద్ద పెద్ద సంస్థలు నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయి.- **సీహెచ్ జ్యోతి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, కడప.**

మట్టి టిప్పర్ పట్టివేత

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలోని ఎగువ చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సోమవారం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సీజ్ చేశారు. సీజ్ చేసిన టిప్పర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

గడ్డివామి, పూరిగుడిసె దగ్ధం

బద్వేలు అర్బన్ : బద్వేలు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివామి, పూరిగుడిసె దగ్ధమైనట్లు ఫైర్ ఆఫీసర్ ఎం.చంద్రుడు తెలిపారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ గోశాలకు సంబంధించిన గడ్డివామి ప్రమాదవశాత్తు దగ్ధమవడంతో రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. అలాగే గోపవరం మండలం రాచాయపేట గ్రామంలో స్వర్ణకొండయ్యకు చెందిన పూరిగుడిసె ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనలో రూ.40 వేలు నష్టం వాటిల్లిందన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



తేనెటీగలు దాడి చేయడంతో తలకు టవళ్లు చుట్టుకుని పరుగులు తీస్తున్న కూలీలు

రాజుపాళెం : మండలంలోని సోమాపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న దాదాపు 25 మంది ఉపాధి కూలీలపై సోమవారం తేనెటీగలు దాడి చేశాయి. గ్రామ సమీపంలోని వంకలో జమ్ము కోసే క్రమంలో తేనెటీగలు అక్కడ ఉండటంతో ఒక్క సారిగా వారిపై దాడి చేశాయి. మొత్తం 150 మంది కూలీలు అక్కడ పని చేస్తుండగా ఒక్క సారిగా తేనెటీగలు వచ్చి వారిపై దాడి చేయడంతో భయపడిన కూలీలు పరుగులు తీస్తూ కిందా మీద పడి గ్రామంలోకి చేరుకున్నారు. తేనెటీగల దాడిలో గాయపడిన వారంతా రాజుపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు. ఈ విషయాన్ని ఏపీఓ లక్ష్మీనారాయణ దృష్టికి కూలీలు తీసుకెళ్లారు.

వాహిద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీపీ వెంకటసుబ్బమ్మ

కడప కార్పొరేషన్ : ఒక మహిళను మోసం చేసి, ఆమె సోదరుడిపై దాడి చేయించిన కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి పీఏ వాహిద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, నగర అధ్యక్షురాలు బండిదీప్తి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఆయేషా అనే మహిళను రెండో వివాహం చేసుకున్న వాహిద్, పెళ్లి అయినప్పటి నుంచి ఆమెను వేధించడం మొదలు పెట్టాడన్నారు. ఆమె నగ్న వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేస్తుండేవాడన్నారు. ఇదేమని ప్రశ్నించిన ఆమె సోదరుడిపై వాహిద్ అనుచరులు శనివారం రాత్రి దాడి చేశారన్నారు. రక్త గాయాలతో వెళ్లి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. అర్ధరాత్రి ఆయేషా సోదరుడితో కలిసి ఎమ్మెల్యే ఇంటివద్దకు వెళ్లి ఆమెకు వాయిస్ మెసేజ్‌లు పెట్టి మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. మహిళలకు రక్షణ కావాలి, భద్రత ఉండాలని అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే మాధవి తన వద్దకు వచ్చిన మహిళకే రక్షణ ఇవ్వలేకపోయారని విమర్శించారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని ఎంతోమంది మహిళలను వాహిద్ లైంగికంగా వేధించాడని ఆరోపించారు. దాడికి పాల్పడిన వాహిద్, అతని అనుచరులను పార్టీ నుంచి సస్పెండ్ చేసి, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దిశ చట్టం ఉన్నప్పుడే మహిళలకు తగిన భద్రత, రక్షణ ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయేషాకు న్యాయం జరిగేంత వరకూ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో పోరాడుతూనే ఉంటామని చెప్పారు. ఈ సమావేశంలో మహిళా విభాగం రాష్ట్ర నేతలు మూలే సరస్వతీదేవి, రత్నకుమారి, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, నారాయణమ్మ, శ్రీదేవి, సుశీలమ్మ పాల్గొన్నారు.

కడప మహిళా స్టేషన్ డీఎస్పీగా బాలస్వామిరెడ్డి



బాలస్వామి రెడ్డి

కడప అర్బన్ : కడప మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాలస్వామి రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1995 బ్యాచ్‌కి చెందిన ఈయన ఎస్ఐగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహించారు. 2007లో సీఐగా, 2020లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కడప హ్యూమన్ రైట్స్ డీఎస్పీగా పనిచేస్తూ కడప మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ఫిర్యాదులపై సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కడపలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు



కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ టీం

కడప అర్బన్ : కడప నగరంలోని వైవీ స్ట్రీట్‌లో సోమవారం సాయంత్రం ఆకస్మికంగా పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి డాగ్‌స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ టీం బృందం వారు తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానితులుగా ఉన్నా, వస్తు సామగ్రి కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వ్యాపారులకు, ప్రజలకు సూచించారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్‌కు ఈనెల 24వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి (48)ని చికిత్స నిమిత్తం తీసుకు వచ్చారు. అతనికి వైద్య పరీక్షలు చేసిన క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ మరణించాడని నిర్ధారించారు. అతని మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.

సమస్యలపై సత్వరమే స్పందించాలి

డీఆర్వో విశ్వేశ్వరనాయుడు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యల పట్ల అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

- బీసీ కుల గణన చేపట్టాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు యాదవ్, ఏపీ దళితమిత్ర సంఘం అధ్యక్షుడు కైపు రామాంజనేయులు కోరారు. 1931లో కుల గణన నిర్వహించారని, ఇప్పటివరకు చేపట్టకపోవడం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు.
- సర్వే నెంబరు 847/ఎలోని 4.79 ఎకరాల భూమిని రెవెన్యూ రికార్డుల్లో ఎండోమెంట్ భూమిగా చూపుతున్నారని, దాన్ని సవరించి తనకు న్యాయం చేయాలని కమలాపురం మండలం అప్పాయపల్లెకు చెందిన ఎం.మునీర్ అహ్మద్ కోరారు.
- తనకు ఎలాంటి భూమి, ఆస్తిపాస్తులు లేవని, అయితే ఆన్‌లైన్‌లో తన పేరిట భూమి ఉన్నట్లు చూపుతోందని, ఇందువల్ల తన కుమారుడికి ప్రభుత్వ ఉపకార వేతనం అందకుండా పోయిందని, కనుక ఆన్‌లైన్‌లో తన పేరుతో ఉన్న రికార్డు వివరాలను తొలగించాలని సీకే దిన్నె మండలం మామిళ్లపల్లెకు చెందిన కృష్ణారెడ్డి కోరారు.
- తన ఇంటి స్థలాన్ని ఇతరులు ఆక్రమించి అక్రమంగా గేటు ఏర్పాటు చేశారని, అధికారులు విచారించి న్యాయం చేయాలంటూ కడప ప్రకాశ్‌నగర్‌కు చెందిన టి.నారాయణరెడ్డి కోరారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, వెంకటపతి, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : అధికారం అండగా చూసుకుని జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పసుపులేటి సాయిదత్త, ప్రధాన కార్యదర్శి శ్యాం సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. అధిక ఫీజు వసూళ్ల వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ర్యాంకుల పేరుతో చేస్తున్న వేధింపులు తట్టుకోలేకే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు విద్యార్థి విభాగం అధ్యక్షుడు దావుద్, రుద్రసేనారెడ్డి, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

'ఉర్సా'కు కారుచౌకగా భూములు కట్టబెట్టడం దారుణం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్ : విశాఖపట్నంలో అత్యంత విలువైన భూములను 'ఉర్సా' ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి అత్యంత కారుచౌకగా కట్టబెట్టడం దారుణమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎకరా భూమిని టీసీఎస్ కంపెనీ, ఉర్సా కంపెనీలకు కేవలం ఒక రూపాయికే కట్టబెట్టడం అన్యాయమన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలా ప్రభుత్వ భూములను తక్కువ ధరకే ఇవ్వడం సరికాదన్నారు. 2003లో కూడా చంద్రబాబు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇలాగే హైదరాబాద్ గచ్చిబౌలిలో ఐఎంజీ కంపెనీకి 850 ఎకరాలను కేటాయించారని, వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని రద్దు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇలా ప్రైవేటు సంస్థలకు కారుచౌకగా భూములు కట్టబెడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, కార్యదర్శి సుహైల్ అహ్మద్, ఐటీ విభాగం నగర అధ్యక్షుడు ఫయాజ్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం రెగ్యులర్ చేయాలి

కలెక్టరేట్ వద్ద ఏపీ ఎంసీపీ ధర్నా



ఏపీ ఎంఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆరు సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్న తమకు ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సందీప్‌కుమార్, జిల్లా అధ్యక్షులు గిఫ్టీ షీలా, ఉపాధ్యక్షులు హిమబిందు, ట్రెజరర్ తౌఫిక్‌అలీ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలన్నారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలన్నారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. హెచ్ఆర్ పాలసీ–ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా వంటివి అమలు చేయాలన్నారు.

వైభవంగా అష్టోత్తర కలశాభిషేకం



శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో అష్టోత్తర కలశ పూజ చేస్తున్న వేద పండితులు



పురుషాన్ మృగ వాహనంపై కామాక్షీ వైద్యనాథ స్వామి

వల్లూరు : పుష్పగిరి శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో అష్టోత్తర కలశాభిషేకాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశ్వక్సేన పూజ , పంచామృతాభిషేకం కార్యక్రమాలను జరిపారు. వివిధ రకాల పరిహారాల కోసం బింబ శుద్ధితో 108 కలశాలను ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ నదులలోని పుణ్య జలాలు, విశేష ద్రవ్యాలతో నింపి 108 మంది దేవతలను ఆవాహన చేశారు. అనంతరం కలశాలలోని ద్రవ్యాలతో శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. రాత్రి శ్రీ చెన్న కేశవ స్వామి యాళీ వాహనంపై కొలువు దీరగా మంగళ వాయిద్యాల నడుమ దివిటీల వెలుగులో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

- శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవి అమ్మవారికి కుంకుమార్చనలను నిర్వహించారు. రాత్రి శ్రీకామాక్షీ వైద్యనాథేశ్వర స్వామిని పురుషాన్ మృగ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

పుష్పగిరిలో నేడు చందనోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి చందనోత్సవం అత్యంత ఘనంగా జరుగుతుంది. రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. కామాక్షీ వైద్యనాథ స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు ఉంటాయి. రాత్రి మయూర వాహన సేవ జరుగుతుంది.

విద్యార్థిని చితకబాదిన స్కూలు యాజమాన్యంపై చర్యలకు డిమాండ్



తన చేయి కమిలిన స్థితిని చూపుతున్న విద్యార్థి మూల సాత్విక్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామ పంచాయతీలోని పూజా ఇంటర్నేషనల్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న మూల సాత్విక్‌రెడ్డిని చితకబాదిన పాఠశాల డీన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లి లెక్కల కొండమ్మ, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్‌రెడ్డి సోమవారం డీఆర్వో విశ్వేశ్వర నాయుడును కోరారు. విద్యార్థి పేరిట నకిలీ ఇన్‌స్టాగామ్ సృష్టించి అమ్మాయిలను వేధించాడని ఆరోపిస్తూ కేసు నమోదు చేశారని ఆరోపించారు. టీసీ కూడా ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. జరిగిన విషయాలను డీఈఓ, పోలీసులు, కలెక్టర్‌కు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. తమకు సంబంధం లేదంటూ ప్రొద్దుటూరు డీఎస్పీ మాట్లాడటం విచారకరమన్నారు. ఇప్పటికైనా టీసీ ఇప్పించాలని కోరారు.